# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.**

**2. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ తనిఖీలను నిర్వహిస్తున్నామని పోలీసు వర్గాలు తెలిపాయి.**

**3. తెలంగాణలోని బాసర రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయంలో బీటెక్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.**

**4. రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు మధ్యలో అధిక వర్ష పాతం నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.**

**5. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటులు నందమూరి తారక రామారావు శత జయంతి ఈ రోజు.**

==========================

స్వార్థం లేకుండా చేసే ప్రజా సేవను అంతర్గత ఆధ్యాత్మిక సామాజిక భావనగా భావించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. నిన్న ఢిల్లీలోని భారత్ మండపంలో బ్రహ్మ కుమారీస్ నిర్వహించే స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆధ్యాత్మిక జాతీయ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగిస్తూ ప్రజల మంచి కోసం చేసే దానం ఆధ్యాత్మిక విలువల్లో అతి ముఖ్యమైన గుణమని అన్నారు. ఆధ్యాత్మిక శక్తి నిజమైన శక్తి అని, ఆధ్యాత్మిక విలువలు అన్ని మతాల ప్రజలను ఒకరితో ఒకరిని కలుపుతాయని రాష్ట్రపతి పేర్కొన్నారు.

--------------------------

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. నిన్న గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ దూడిలతో కలిసి ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. సమస్యాత్మక నియోజకవర్గ ప్రాంతాల్లో అదనపు బలగాలను నియమిస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద

మూడంచెల భద్రత కొనసాగుతుందని పేర్కొంటూ..

వాయిస్ (35 సెకన్లు)

-------------------------

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ కోసం డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ తనిఖీలను నిర్వహిస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో ఈ కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాల పరిధిలోని అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటివి గుర్తించేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పొలిసు అధికారులు పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణలోని బాసర రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 1 నుంచి 26 వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా 15 వందల సీట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అందులో 15 శాతం సీట్లకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణలోని ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిన్న ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 4 గంటల వరకు వరుసలో నిలబడిన వారందరికీ ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు పట్టభద్రులుపెద్ద ఎత్తున ఓటేసేందుకు రావడంతో నిన్న సాయంత్రం వరకు 49.35 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ శాతాన్ని అధికారకంగా ఎన్నికల సంఘం ప్రకటించాల్సివుంది. మూడు ఉమ్మడి జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించారు. వచ్చే నెల 5వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఉపఎన్నికలో మొత్తం 49 మంది పోటీలో ఉన్నారు.

-------------------------

తెలంగాణలోని ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఆదర్శ పాఠశాల అదనపు సంచాలకుడు శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

-------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ ముఖ్యమంత్రి, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటులు నందమూరి తారక రామారావు జయంతి ఈ రోజు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు అయిన నందమూరి తారక రామారావు 1923, మే 28న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో జన్మించారు. జానపదం, సాంఘికం, పౌరాణికం వంటి చిత్రాల్లో అన్ని పాత్రల్లో నటించి మెప్పించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో కలిపి దాదాపు 400 చిత్రాలలో ఆయన నటించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన.. ఆయన ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారు.

తారక రామారావు జన్మించి నేటికీ 100 ఏళ్ళు పూరైంది. ఈ సందర్భంగా ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరుగుతాయని అమరావతి వాతా వరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో ఎండ ప్రభావం అధికంగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈరోజు 149 మండలాల్లో తీవ్ర వడగాలులు, 160 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని వివరించింది. అలాగే తెలంగాణలో వచ్చే ఐదు రోజుల్లో రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరగవచ్చని పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు మధ్యలో సాధారణం కంటే ఎక్కువ వర్ష పాతం నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దేశవ్యాప్తంగా నెలవారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరుగుతాయని,.రాబోయే ఐదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ డైరక్టర్ డాక్టర్ మహపాత్ర తెలిపారు. దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, లక్షద్వీప్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు నైరుతి పవనాలు విస్తరించే అవకాశముందని వెల్లడించారు. మరోవైపు పశ్చిమబెంగాల్- బంగ్లాదేశ్ మధ్యలో తీరం దాటిన తీవ్ర తుపాను రెమాల్ తుపానుగా బలహీనపడింది.

---------------------------

తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆమె నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 2న గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పించి, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై కళారూపాల ప్రదర్శనతో పాటు స్వయం సహాయక బృందాల హస్తకళల, చేనేత కళల స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జూన్ 2న రాత్రి ట్యాంక్ బండ్ పై బాణాసంచా, లేజర్ ప్రదర్శన నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతులు, పునరుద్ధరణ పనులను పర్యవేక్షించడానికి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ కమిటీ బృందం నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మేడిగడ్డకు చేరుకొని బ్యారేజీ దెబ్బతిన్నప్పటి పరిస్థితులు, ప్రస్తుత తీరును గమనించారు. ఎగువ, దిగువ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలు చేపడుతుండగా తలెత్తుతున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏడో బ్లాక్ ప్రదేశంలో బుంగలు, నీటి ఊటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. పునరుద్దరణ పనులను వర్షాలు పడే లోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారులకు సూచించారు.

---------------------------

పాలిటెక్నిక్ విద్యార్థులు విద్యాభ్యాసం అనంతరం ఉపాధి అవకాశాలు పొందే విధంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ నాగరాణి తెలిపారు. శ్రీకాకుళంలో పాలిటెక్నిక్ కళాశాలలో విద్య పూర్తి చేసుకుని ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం నాగరాణి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 12 వేల మంది క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఎక్కువగా గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉద్యోగులుగా ఎంపికవ్వడం హర్షణీయమన్నారు. ఐటీ రంగంతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు.

======================